అన్ని వర్గాల ఆశాజ్యోతి జగన్

- అందుకే ఆయనే మళ్లీ రావాలి
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదల పక్షపాతి.. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి.. సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, గృహ సారథులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు సుపరిపాలన అందజేస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యలపై అధికారులు సైతం ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటిని పరిష్కరిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో డబ్బున్న వారి పక్షాన నిలబడ్డారని, పేదలకు అన్యాయం చేశారని ఆరోపించారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పేదల పక్షాన నిలిచి, వారి సంక్షేమం తలచి.. నేరుగా వారి ఖాతాల్లోనే డబ్బులు జమ చేసి.. వారి ఆర్థికాభ్యున్నతికి తనవంతు సహకారం అందిస్తున్నారన్నారు.

మరో 30 ఏళ్లు జగనన్నే సీఎం

గృహ సారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని ఎమ్మెల్యే నాగిరెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని చాటిచెప్పాలని కోరారు. ఇదే తీరుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేస్తే మరో 30ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించడం ఖాయమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే అంశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు చేసే ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని, ఈ విషయంలో నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు తిప్పల దేవన్‌రెడ్డి, కోమటి శ్రీనివాసరావు, రోజారాణి, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, రాజాన రామారావు, నాయకులు ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్, దొడ్డి రమణ, శ్రీనివాస్‌రెడ్డి, కులుకూరి మంగరాజు, మంత్రి శంకరనారాయణ, పూర్ణానందశర్మ, ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి రక్ష

- జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు
- చేరువలోనే వైద్య సేవలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- గంగవరంలో 1100 మందికి వైద్యసేవలు



రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది



శిబిరంలో చిరుధాన్యాలతో చేసిన తినుబండారాల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



రోగి దంతాలు పరీక్షిస్తున్న దంత వైద్యురాలు

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షగా నిలుస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న మంచి ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమం పేదలందరికీ ఓ వరమన్నారు. పేదలకు ఇంటి సమీపంలోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మాదిరిగా వైద్యం అందుతోందన్నారు. ఈ శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. అవసరమైన వారిని వేరే ఆస్పత్రికి రిఫర్ చేసి రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే శస్త్రచికిత్సలు కూడా చేయిస్తుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని పేదలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన తినుబండారాల స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు.

సేవలందించిన 13మంది వైద్యులు

శిబిరంలో 1100 మందికి 13మంది వైద్యులు డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ పావని, దీప్తి, ఆమీర్, అతిథి మిశ్రా, శ్రావణి, సంతోష్, దివ్యలత, సాయిరామ్, మానస, ప్రియాంక, రాజు, వరలక్ష్మి తదితరులు సాధారణ వైద్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి బ్లడ్ టెస్టులు చేశారు. వైద్యులు పరిశీలించిన అనంతరం మందులు అందించారు. అవసరమైన వారిని వేరే ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, జోన్-6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, ఏఎంహెచ్‌వో కిరణ కుమార్, వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్, ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



రోగుల వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

క్లుప్తంగా

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

గాజువాక: టెక్ మహీంద్ర ఫౌండేషన్, భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ట్రస్ట్ కార్యదర్శి శ్రీరామ్మూర్తి తెలిపారు. బీటెక్, డిప్లమా, ఐటీఐ అర్హతతో 18 నుంచి 29 ఏళ్ల వయస్సుగల యువతీ యువకులకు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలో మూడు నెలలపాటు ఇండస్ట్రియల్ ఓరియెంటెడ్ శిక్షణను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. శిక్షణతో పాటు సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్స్‌లో ప్రాథమిక విజ్ఞానాన్ని నేర్పించి ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తామని తెలియజేశారు. పూర్తి వివరాల కోసం 63099 56385, 98668 94969 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చురుగ్గా ఆరోగ్య సురక్ష సర్వే

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో ఈ నెల 12న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా వార్డు వైద్య సిబ్బంది వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు నిర్దేశించిన 7 రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్, కంటి సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సంబంధిత స్పెషలిస్ట్ డాక్టర్‌చే వైద్య పరీక్షలు నిర్వహించేందుకు టోకెన్లు అందజేస్తున్నారు. చిన్నఅక్కిరెడ్డిపాలెంలో గురువారం సచివాలయాల ఏఎన్‌ఎంలు అబద్దం, మహాలక్ష్మి, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, వలంటీర్లు, షీలానగర్ మనీషా నర్సింగ్ కళాశాల నర్సింగ్ విద్యార్థినులు సంయుక్తంగా పలువురికి బీపీ, షుగర్ వంటి వ్యాధులకు ఇంటి వద్దే పరీక్షలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్లోని 33/11 కేవీ ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ముఖ్యంగా శాతవాహన నగర్ రోడ్ నెం.1 నుండి 9, శివాజీనగర్, ఆల్ ఇండియా రేడియో, గౌరీనగర్, శివశివానీ నగర్, యాతపాలెం, ముస్తఫా జంక్షన్ ప్రాంతాల్లోని ఫీడర్ల పరిధిలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగికి లాంగ్ సర్వీస్ అవార్డు



దేముడుకు అవార్డు అందిస్తున్న విభాగాధిపతి శ్రీనివాసులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పీ) ఫోర్‌మన్ కె.దేముడుకు గురువారం లాంగ్ సర్వీసు అవార్డు అందజేశారు. హెచ్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో ఆర్‌ఎంహెచ్‌పీ విభాగం కాన్ఫరెన్స్ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌లో చేరి 25 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా దేముడుకు విభాగాధిపతి శ్రీనివాసులు చేతుల మీదుగా 150 గ్రాముల సిల్వర్ కాయిన్, సర్వీస్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ డీజీఎం రాధిక, సీనియర్ మేనేజర్లు వి.సుబ్రమణ్యం, బి.జోగారావుతో పాటు విభాగం అధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

22న స్టీల్‌ప్లాంట్‌లో బతుకమ్మ సంబరాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 22న బతుకమ్మ పండగ నిర్వహిస్తున్నామని స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. గురువారం ఉక్కునగరంలో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ మాట్లాడారు. ఈ ఏడాది కూడా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తెలంగాణా ఉద్యోగులందరూ తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్.కుమారస్వామి, బి.వెంకటేశ్వర్లు, ఎన్.నర్సింగరావు, ఎన్.చందర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. దేశ ప్రజలందరి హక్కు

- ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలి
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- 'ఉక్కు' దీక్షలకు సంఘీభావం



ఉక్కు దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

కూర్మన్నపాలెం: జాతీయ సంపదైన విశాఖ ఉక్కు దేశ ప్రజలందరి హక్కు అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఎందరో మహనీయుల త్యాగాలతో సాధించుకున్న అటువంటి పరిశ్రమను ఐక్య పోరాటాలతోనే కాపాడుకోగలమన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే దీక్ష శిబిరాన్ని 966వ రోజు గురువారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.

పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రుణమాఫీ

సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత 9 ఏళ్లలో పెట్టుబడిదారులకు మోదీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిందన్నారు. ఉక్కు కర్మాగారానికి ఉన్న అప్పులు చాలా తక్కువ అని, వాటిని రుణమాఫీ చేయాలంటే మోదీకి సులువైన పని అన్నారు. కానీ అలా చేయకుండా ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడం అన్యాయమన్నారు. ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు చేస్తున్న పోరాటాలను కేంద్ర ప్రభుత్వం విచ్ఛిన్నం చేయాలని చూస్తోందని, ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమను కార్మికుల ఐక్య పోరాటాలతో కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

దసరాలోగా బోనస్ చెల్లింపునకు వినతి



హెచ్‌ఆర్ సీజీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు దసరా పూజలోగా బోనస్ చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. నాయకులు గురువారం స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గత ఆర్థిక సంవత్సరంలో కార్మికులు అకుంఠిత కృషితో రూ. 22,729 కోట్లు టర్నోవర్ సాధించడం జరిగిందన్నారు. దానికి గాను కార్మికులకు రూ. 60 వేలు బోనస్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కొమ్ము ప్రసాద్, బీఎంకె నాయక్, పి.వి.నగేష్, ఎస్.ఎ.నాయుడు, గోపాలరాజు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ఏచూరికి వినతి



సీతారాం ఏచూరికి వినతిపత్రం అందజేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్టీల్‌ప్లాంట్ సమస్యలపై సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి వివరించారు. ఉక్కుహౌస్‌లో జరిగిన కార్యక్రమంలో వారు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం తీరును వివరించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి చేస్తున్న ప్రయత్నాలను ఆయన దృష్టికి తెచ్చారు. స్టీల్‌ప్లాంట్‌కు ఐరన్ ఓర్, కోల్ సరఫరాపై జరుగుతున్న అవాంతరాలను వివరించారు. సిబ్బంది తగ్గిపోతున్నా నూతన నియామకాలు జరగడం లేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడం, కొత్త నియామకాలు చేపట్టడం, కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పోరాట కమిటీ నాయకులు సీహెచ్.నర్సింగరావు, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వై.మస్తానప్ప, గణపతిరెడ్డి, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాసరావు, సురేష్‌బాబు, రామ్మోహన్‌కుమార్, సన్యాసిరావు, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులందరికీ ఆశ్రయం



నిరాశ్రయుడి వివరాలు సేకరిస్తున్న మమత

విశాఖ విద్య: నిరాశ్రయులందరికీ జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షెల్టర్లలో ఆశ్రయం కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నామని ఎన్‌ఏడీ బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తెలిపారు. జీవీఎంసీ అధికారుల ఆదేశాల మేరకు గురువారం ఎన్‌ఏడీ కూడలిలో స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి రోడ్ల పక్కన ఉన్న నిరాశ్రయుల వివరాలు సేకరించారు. జీవీఎంసీ షెల్టర్‌లో ఉచిత వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నందున, అక్కడికి తరలిరావాలని సూచించారు. నిరాశ్రయులకు అన్ని విధాలుగా ఆసరాగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దల్లివానిపాలెంలో ఈ నెల 15 నుంచి 24 వరకు నిర్వహించనున్న దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు గురువారం పందిరి రాట వేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కార్పొరేటర్ వంశీరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటా ఇక్కడ నూకాంబిక సేవా సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గొందేశి సత్యారావు, దల్లి పైడికొండ, గొందేశి అప్పారావు, పాల శ్రీను, చూక సునీత తదితరులు పాల్గొన్నారు.

'కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

పెదగంట్యాడ: ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి హుస్సేన్ డిమాండ్ చేశారు. పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో అసోసియేషన్ అధ్యక్షుడు కణితి అప్పలరాజు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు రైలు ప్రయాణాల్లో 50శాతం రాయితీ అమలు చేయాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దీనబంధు మాట్లాడుతూ పెన్షనర్లకు రైస్‌కార్డులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఒక్కో పెన్షనర్‌కు రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు పెన్షన్ వస్తోందని, ఇటువంటి పరిస్థితుల్లో వారు తమ కుటుంబాలను ఎలా నెట్టుకువస్తారని ప్రశ్నించారు. పెన్షన్‌పై ఆధారపడి బతుకుతున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో పిట్ట గురునాథ్, నమ్మి అప్పలనాయుడు, గంట్యాడ పైడియ్య, కాకినాడ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- నగరంలో 15 కూడళ్ల గుర్తింపు
- ప్రత్యేక బందాలతో ట్రాఫిక్ పర్యవేక్షణ
- డీసీపీ-1 శ్రీనివాసరావు



ద్వారకా పోలీస్ స్టేషన్‌లో డీసీపీ-1 శ్రీనివాసరావు

సీతమ్మధార: నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ-1 శ్రీనివాసరావు తెలిపారు. ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మహా విశాఖలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని 15 ప్రధాన కూడళ్లు మద్దిలపాలెం, హనుమంతువాక, సిరిపురం, గాజువాక, ఎన్‌ఏడీ, గోపాలపట్నం, కొమ్మాది, గురుద్వారా, పెందుర్తితోపాటు పలు ప్రాంతాలను గుర్తించామన్నారు. ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ రెగ్యులేషన్ కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు 15 జంక్షన్ల వద్ద ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్, క్రైం, రిజర్వ్ పోలీసులు పర్యవేక్షిస్తారన్నారు. ఫ్రీ లెఫ్ట్ ఉపయోగించకుండా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న వారు, బస్ బేల వద్ద ఆటోలు నిలిపివేస్తున్న వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు చేపడతామన్నారు. నగర ప్రజలు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

నగరంలోని రౌడీషీటర్లపై, గంజాయి తరలింపు కేసులపై ప్రత్యేక నిఘా పెట్టామని డీసీపీ-1 శ్రీనివాసరావు తెలిపారు. పాత కేసుల్లో ఉన్న వారి వివరాలు సేకరించామని, వారి రోజు వారి విధానాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగరంలో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. డీసీపీ శ్రీనివాసరావుతోపాటు ద్వారకా ఏసీపీ మూర్తి, ద్వారకా ఇన్‌చార్జి సీఐ భాస్కరరావు, ఎస్ఐ అప్పలరాజు తదితరులు ఉన్నారు.

కథల పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు అయ్యగారి సీతారత్నం రచించిన కూరాకులమడి కథల పుస్తకాన్ని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సమకాలీన, సాంఘిక సమస్యలపై అవగాహనతో రాసిన కథల సంపుటిగా ఈ పుస్తకం నిలుస్తుందన్నారు.రెక్టార్ ఆచార్య కె.సమత, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డులో ప్రమాదకరంగా గోతులు




గోతులమయంగా ఉన్న సర్వీసు రోడ్డు



గోతిలో పడిపోయిన వాహన చోదకులు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ నుంచి గాజువాక వైపు వెళ్లే మార్గంలో పెట్రోల్ బంక్ దాటిన తర్వాత సర్వీసు రోడ్డు గోతులమయంగా ఉంది. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రమాదకరంగా ఉన్న గోతి వద్ద వ్యానును తప్పించబోయిన ద్విచక్రవాహనం అదుపు తప్పి గోతిలో పడిపోయింది. గొయ్యి వాన నీటితో నిండిఉండటంతో వాహనంపై ఉన్న ఇద్దరూ ఆ నీటిలో పడిపోయారు. కార్లు, వ్యాన్లు వంటి వాహనాలు గోతుల వద్దకు వచ్చి ఆగిపోవడంతో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనచోదకులు చాలా సేపు నిరీక్షించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను వైభవంగా జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయ దాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

కృష్ణమంజరికి 'ఫార్మసీ టీచర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు



కృష్ణమంజరి పవార్‌ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎ.కృష్ణమంజరి పవార్‌కి ఫార్మసీ టీచర్ ఆఫ్ ది ఇయర్ 2022 అవార్డు లభించింది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఫార్మసీ టీచర్స్ ట్రస్ట్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య పవార్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, తదితరులు పాల్గొన్నారు.